సేంద్రియం.. భూమికి సారం

- ఎరువులతో పెట్టుబడుల భారం
- వర్మీకంపోస్టుతో ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ
- తయారీ రైతులకూ సులభమే


వినియోగానికి సిద్ధంగా ఉన్న వర్మీకంపోస్టు ఎరువు

ఇల్లెందురూరల్: వ్యవసాయ భూములు రసాయనిక ఎరువుల వాడకంతో నిస్సారం అయ్యాయి. ఫలితంగా దిగుబడులు ఏటేటా తగ్గుముఖం పడుతున్నాయి. 30 ఏళ్ల కిందట వచ్చిన దిగుబడులే నేడు వస్తున్నాయని వ్యవసాయశాఖ అధికారులే చెబుతున్నారు. బస్తాల కొద్ది రసాయనిక ఎరువులు కుమ్మరిస్తున్నా పెట్టుబడులు రాని దైన్యం రైతుల్లో నెలకొంది. రైతులు వాడుతున్న రసాయనిక ఎరువులతో కేవలం ఒకటి, రెండు పోషకాలు మాత్రమే అందుతున్నాయని.. అదే సేంద్రియ ఎరువులు వాడితే మొక్కకు అందాల్సిన 16 రకాల పోషకాలు అందుతాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అంతేకాకుండా సేంద్రియ వ్యవసాయ సాగుతో పండించిన ధాన్యానికి ధర ఎక్కువ పలుకుతుందని చెబుతున్నారు.

పెట్టుబడుల భారం

పశు సంపద తగ్గిపోవడం.. రైతులు రసాయన ఎరువులకు అలవాటు పడటంతో భూసారం తగ్గిపోతోంది. దీంతో దిగుబడులు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా బస్తాల కొద్ది యూరియా, డీఏపీ వేయడంతో నేల భౌతిక స్వభావం మారిపోతోంది. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి పంటలు భూసారాన్ని లాగేస్తాయి. దీనికి తోడు యూరియా, డీఏపీలు మరింతగా నేల సారాన్ని పీల్చి వేస్తాయి. నేలలో లవణాలు తగ్గిపోయి దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు ఏటేటా వర్షాలు కూడా తగ్గుముఖం పట్టడంతో నేలలు తడవడం లేదు. తొలకరి వర్షాలు పడినప్పుడు మే, జూన్ నెలల్లో దుక్కులు కలియ దున్నిన చౌడ నేలల్లో పిల్లి పెసర, జీలుగ పంటలు వేయడం.. అవి మొలకెత్తిన తరువాత కలియదున్నితే మూలకాలు మారుతాయి. ఏటేటా ఈ విధంగా చేస్తే కొంత వరకు ఫలితం కనిపిస్తుంది.

పోషకాలు అనేకం

వర్మీకంపోస్టు అంటే వానపాముల ఎరువు. పచ్చి రొట్ట, పశువుల ఎరువు వాడటంతో పంటలకు 16 రకాల పోషకాలు అందుతాయి. వీటిలో సూక్ష్మపోషకాలు, ఐరన్, కాపర్, మెగ్నీషియం, సల్ఫర్, జింక్ తదితరాలన్నీ ఉంటాయి. వీటికితోడు జీవ నియంత్రణ ఎరువులు కూడా వేస్తే తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు. ఒకసారి సేంద్రియ ఎరువులు వేసినంత మాత్రాన దిగుబడులు రావు. రసాయన ఎరువులకు అలవాటు పడిన పొలాల్లో కొన్ని సంవత్సరాల పాటు సేంద్రియ ఎరువులు వాడితేనే ఫలితం వస్తుంది. రైతులు రసాయనిక ఎరువులను వాడుతూపోతే దిగుబడులు ఏ మాత్రం రాకపోగా పెట్టుబడులు వాటికే ఖర్చు అవుతున్నాయి.

పంచాయతీల్లోనూ ముమ్మరంగా తయారీ

ప్రస్తుతం ప్రతి గ్రామ పంచాయతీలోనూ వర్మీకంపోస్టు యూనిట్లు ఉన్నాయి. గ్రామాల్లో ప్రతి రోజు సేకరించిన చెత్త సహాయంతో ప్రత్యేక నిర్మాణాలలో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. పశువుల పేడ, వ్యర్థాలు, వానపాములు వినియోగించి తయారు చేస్తున్నందున ఇక్కడ నాణ్యమైన ఎరువు ఉత్పత్తి అవుతోంది. ఎరువు తయారీ యూనిట్‌లో పనిచేసేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. పెద్దమొత్తంలో తయారవుతున్న సేంద్రియ ఎరువును పంచాయతీ అధికారులు నర్సరీలు, ఎవెన్యూ ప్లాంటేషన్‌కు వినియోగిస్తున్నారు. వీటికి పోను అదనంగా ఉన్న ఎరువును అవసరమైన వారికి విక్రయిస్తున్నారు.

వర్మీకంపోస్టుతో ప్రయోజనాలు

వర్మీకంపోస్టుతో నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరుగుతాయి. ఇది ఆ పంటకే కాకుండా రెండు, మూడు పంటలపై ప్రభావం చూపుతుంది. మొక్కకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు పైరు ఎదుగుదలకు అవసరమయ్యే సేంద్రియ రసాయనాలు అధికంగా ఉంటాయి. పలు రకాల ఎంజైములు, అమైనో ఆమ్లాలు, హార్మోన్లు తయారై త్వరగా పెరగడానికి తోడ్పడుతాయి. భూమికి ఉపయోగమైన సూక్ష్మజీవులు వృద్ధి చెంది నేలకు ఇస్తాయి. కూరగాయలు, పండ్లు తదితర ఉత్పత్తుల నాణ్యత పెరుగుతుంది. రంగు, రుచి, వాసన, రవాణాలో నిల్వ ఉండే గుణం కలిగి ఉంటాయి.

తయారీ సులువే



సేంద్రియ ఎరువులను ప్రతి రైతు సులువుగా తయారు చేసుకోవచ్చు. పశువుల వ్యర్థాలను ఇష్టానుసారంగా పారేయకుండా చెత్తను విడదీసి పశువుల పేడను మాత్రమే ఒకపద్ధతి ప్రకారం నిల్వ ఉంచితే కొద్ది రోజుల్లో లభించేదే సేంద్రియ ఎరువు. ప్రస్తుతం చాలా మంది రైతులు సొంతంగా సేంద్రియ ఎరువును తయారు చేసుకుంటున్నారు. ఈ ఎరువు వల్ల ప్రయోజనాలు అనేకం. రసాయన ఎరువుల వినియోగం వల్ల వచ్చే దిగుబడుల కంటే సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.

–సతీశ్‌కుమార్, ఏఓ, ఇల్లెందు

క్లుప్తంగా

సింగరేణి సీఎండీకి ఏఐటీయూసీ వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): యాజమాన్యం విడుదల చేసిన పనివేళల మార్పుతో కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని, తొలి షిఫ్ట్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్చాలని కోరుతూ ఏఐటీయూసీ బృందం సీఎండీ బలరాంకు వినతి పత్రం అందించారు. అలాగే, 2023 నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే మినిస్టీరియల్ స్టాఫ్, సెక్యూరిటీ సిబ్బందిని ఆన్ డ్యూటీ కింద పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ సెమిస్టర్ల పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు సెమిస్టర్ల పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 335 మంది విద్యార్థులకు గాను 11 మంది గైర్హాజరు కాగా 324 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగిన పరీక్షకు 355 మంది విద్యార్థులకు గాను 20 మంది గైర్హాజరు కాగా 335 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

చీఫ్ క్యాంపెయినింగ్ కోఆర్డినేటర్‌గా జనక్‌ప్రసాద్

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌ను కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల క్యాంపెయినింగ్ చీఫ్ కోఆర్డినేటర్‌గా రాష్ట్ర చైర్మన్ మధుయాష్కీ నియమించారని సంఘం జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ తెలిపారు. కొత్తగూడెంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తద్వారా సింగరేణిలో నూతన గనుల సాధన, కార్మికుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. సమావేశంలో నాయకులు ఎండీ రజాక్, పీతాంబరం, ఆల్బర్ట్, రాజేశ్వరరావు, బి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

ఇల్లెందురూరల్: అకాల వర్షంతో నేలవాలిన విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. మండలంలోని చల్లసముద్రం, మామిడిగుండాల, ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ఆదివారం రాత్రి నుంచి పునరుద్ధరణ పనులు ప్రారంభించిన ట్రాన్స్‌కో అధికారులు సోమవారం ప్రధాన రహదారుల వెంట నూతన స్తంభాలు అమర్చారు. రైతులకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకున్నామని ట్రాన్స్‌కో ఏఈ రవి, లైన్‌ఇన్‌స్పెక్టర్ చలమయ్య తెలిపారు.

వంశీని సస్పెండ్ చేయాలి

ఇల్లెందు: తెలంగాణలో టీడీపీ వైఖరి వెల్లడి కాకముందే కాంగ్రెస్‌తో పని చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తనకు తానే హోదా ప్రకటించుకుని డబ్బు కోసం పార్టీని తప్పుదారి పట్టిస్తున్న ముద్రగడ వంశీని సస్పెండ్ చేయాలని టీడీపీ జిల్లా, మండల నాయకులతో కలిసి క్లింట్ రోచ్, పుట్టా ఉపేందర్ యాదవ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ వద్ద రూ.6 లక్షలు తీసుకుని స్వప్రయోజనాల కోసం ఖర్చు చేశాడని తెలిపారు. తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పార్లమెంట్ ఇన్‌చార్జ్ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ విషయమై ముద్రగడ వంశీని వివరణ కోరగా క్లింట్, ఉపేందర్, ఇతరుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వారి ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు.

ఉపాధి కూలీకి గాయాలు

పాల్వంచరూరల్: మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న క్లెం కలింగారెడ్డికి ప్రమాదవశాత్తు చెట్టు కర్ర చేతికి గుచ్చుకొని గాయమైంది. వెంటనే అతడిని సిబ్బంది పాల్వంచ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కళాశాల పక్కన గుడి వద్దని వినతి

పాల్వంచరూరల్: నిబంధనలకు విరుద్ధంగా సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రహరీ పక్కన శాశ్వతంగా ముత్యాలమ్మ గుడి నిర్మించే ప్రయత్నం చేస్తుండగా సోమవారం స్కూల్ పేరెంట్స్ కమిటీ అడ్డుకుంది. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రహరీ పక్కన ముత్యాలమ్మ విగ్రహాన్ని గతేడాది రాత్రికి రాత్రే ప్రతిష్ఠించారు. ప్రస్తుతం అక్కడ శాశ్వత గుడి నిర్మాణం కోసం యత్నించగా కళాశాల ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి శాంతింపజేశారు. కాగా, కళాశాల పక్కన గుడి నిర్మిస్తే విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని కలెక్టర్, పోలీసులకు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ బాధ్యులు ఫిర్యాదు చేశారు.

మోస్తరు వర్షం

జూలూరుపాడు: మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. పలు గ్రామాల్లో అక్కడక్కడా వడగళ్లతో కూడిన వాన పడింది. గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతుండగా వర్షం కురవడంతో ఊరట లభించింది.

అప్రకటిత కోతలతో విలవిల

సుజాతనగర్: మండలంలో అమలు చేస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన ఎండల నేపథ్యంలో ఎడా పెడా కోతలు విధించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా మండల వ్యాప్తంగా అప్రకటిత కోతలు అమలవుతున్నాయి. రాత్రి వేళ కరెంట్ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరమ్మతుల పేరిట కరెంట్ తొలగిస్తుండటంతో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అప్రకటిత కోతలు లేకుండా చేసి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి


జూలూరుపాడు: మాట్లాడుతున్న పొంగులేటి మాధురి


కొత్తగూడెంరూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురిరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం, గుండెపుడి, అనంతారం గ్రామాల్లో వారు సోమవారం రాత్రి ప్రచారం చేశారు. అలాగే, వెంగన్నపాలెంలో ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధన్‌రావు నివాసంలో జరిగిన సమావేశంలో మాధురి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుచేస్తున్న నేపథ్యాన అసెంబ్లీ ఎన్నికల మాదిరి లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు బానోత్ విజయ బాయి, లేళ్ల వెంకటరెడ్డి, బొర్రా రాజశేఖర్, పొన్నెకంటి సతీష్‌కుమార్, మాలోత్ మంగీలాల్ నాయక్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నరేష్, నరసింహారావు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి..

మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించి.. లౌకిక ప్రజాతంత్ర హక్కుల కోసం ఇండియా కూటమి బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ కోరారు. జూలూరుపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు బానోత్ ధర్మా, ఏదులాపురం గోపాల్‌రావు, గుగులోత్ రాంచందర్, ఆజాద్, ఎం.కృష్ణయ్య, లింగాల వీరభద్రం, జోగా సారయ్య, తాటి నరసింహారావు, తోటకూర నరేశ్, తెల్లం కృష్ణయ్య పాల్గొన్నారు. ఇక సోమవారం వెంగన్నపాలెం ఎంపీటీసీ మధుసూదన్‌రావు నివాసంలో జరిగిన కాంగ్రెస్, మిత్రపక్ష పార్టీల సమావేశంలో సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సీపీఎం, సీపీఐ నాయకులు భూక్యా వీరభద్రం, గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడారు. అలాగే, జూలూరుపాడులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకుడు భూక్యా వీరభద్రం మాట్లాడారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కొత్తగూడెంరూరల్/కొత్తగూడెంఅర్బన్: సీపీఐ, సీపీఎం బలపరిచిన కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు కోనేరు సత్యనారాయణ, ఆళ్ల మురళి, రజాక్, సత్తి, జానీపాషా, శ్రీనివాస్, మోహన్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కొత్తగూడెంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. వై.ఇందిర, రాజకొమురయ్య, సందీప్, శ్రీకాంత్, రవీందర్, గోపి, కృష్ణ పాల్గొన్నారు.

'మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్'


మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు

జూలూరుపాడు: మోసపూరిత హామీలు, మాయమాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జూలూరుపాడులో సోమవారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, చేయూత పథకం రూ.4,000 పింఛన్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ 2,500, రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా కింద రూ.15,000 ఇవ్వలేదని, మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగటానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపు నిచ్చారు. లోక్‌సభలో తెలంగాణ గొంతుక వినిపించే తనను అత్యధిక మెజార్టీతో రెండోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ కృష్ణ, బానోత్ మదన్‌లాల్, లకావత్ గిరిబాబు, కూరాకుల నాగభూషణం, పోలుదాస్ గోపాలకృష్ణమూర్తి, భూక్యా కళావతి, బానోత్ నీల, మూడ్ చిట్టిబాబు, బానోత్ చిన్నా, లకావత్ హేమ్లా, చావా వెంకటరామారావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, దుద్దుకూరి కృష్ణప్రసాద్, రెడ్డిబోయిన రాము, కోడెం సీతాకుమారి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్, అశోక్‌నగర్ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపు కోసం ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ, కొండల్‌రావు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, పావని, రజని, చిట్టెమ్మ, రాణి, సీతమ్మ, రేణుక, లావణ్య, విజయలక్ష్మి, నాగమ్మ, జ్యోతి, సునీత, ఎల్లమ్మ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఇల్లెందురూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొమరారం గ్రామంలో పోలీసులు సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల సీఐ రవీందర్ మాట్లాడుతూ.. రాజకీయ పక్షాల ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల్లో ప్రజలంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొమరారం, గుండాల ఎస్‌ఐలు సోమేశ్వర్, రాజశేఖర్, ఏఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్భయంగా ఓటు వేయాలని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్ పిలుపునిచ్చారు. ఎస్పీ రోహిత్‌రాజ్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు మండలంలోని బోడులో ఫ్లాగ్ మార్చ్, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు షేక్ సైదా రవూఫ్, పొడిశెట్టి శ్రీకాంత్, ఏఎస్‌ఐ ఎస్‌కే ఆలీ, హెచ్‌సీలు బి.సుధాకర్, పి.దేవ్‌సింగ్, పీసీ కె.మహేశ్ పాల్గొన్నారు.

ఎన్డీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి


బద్దుతండాలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

టేకులపల్లి: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిలబడి పోరాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ కోరారు. సోమవారం ఆమె మండలంలో విస్తృతప్రచారం చేశారు. దేశ ప్రజల సంపద, వనరులను బీజేపీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రజల కడుపులు కొడుతోందని విమర్శించారు. పదేళ్ల కాలంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కల్తీ వెంకటేశ్వర్లు, నర్సింగ్, చిన్ని, నోముల భానుచందర్ పడిత్యా, ఈర్య, హరిసింగ్ పాల్గొన్నారు.

ఎన్డీ అభ్యర్థిని గెలిపించాలి

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని పోచారంతండాలో సోమావరం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. తుడుం శ్రీను, వాంకుడోత్ శ్రీను, రాంబాబు, వెంకన్న, వెంకట్రాం, లచ్చా, రవి, లింగ తదితరులు పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను గెలిపించుకుందాం


ఇల్లెందు: మాట్లాడుతున్న దుగ్గి కృష్ణ

ఇల్లెందు: ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నందున మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించేందుకు సీపీఎం శ్రేణులు కృషి చేయాలని పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు, ఇల్లెందు ఎన్నికల ఇన్‌చార్జ్ దుగ్గి కృష్ణ తెలిపారు. సోమవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబ్దుల్ నబీ, రేపాకుల శ్రీనివాస్, ఆలేటి కిరణ్, మన్యం మోహన్‌రావు, కూకట్ల శంకర్ పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం..

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించుకుందామని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని బొజ్జాయిగూడెంలో ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పూనెం మధు, రాంమూర్తి, చీమల కృష్ణ, అబ్బయ్య, కాయం రమేశ్ పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి..


చుంచుపల్లి: అభివాదం చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ స్థానంలో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కోరారు. సోమవారం అంబేడ్కర్‌సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేఎస్పీ రోడ్డు, శాస్త్రీ రోడ్డు, బస్టాండ్ సెంటర్, బీసీఎం రోడ్డు, దమ్మపేట సెంటర్ రోడ్డుషో నిర్వహించి మాట్లాడారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, జిల్లాకు ఒక పరిశ్రమను కూడా తీసుకురాలేదని, బీజేపీ వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్ని కూటములు వచ్చినా మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగాకిరణ్, చింతలచెరువు శ్రీనివాసరావు, రాపాక రమేశ్, వెంకటేశ్వర్లు, గంధం నాగేంద్రప్రసాద్, రవికుమార్, ఎడ్లపల్లి శ్రీనివాసకుమార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం

చుంచుపల్లి: అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశంలోని బీసీలకు అన్యాయం జరిగిందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజయ్ గణతే తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ తెలంగాణ సామాజిక సమ్మేళనం ఓబీసీ జిల్లా అధ్యక్షులు బి.క్రాంతి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో బడుగు బలహీన వర్గాలను పథకాలతో సంతృప్తి పరిచి ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుందని ఆరోపించారు. బీసీలకు బీజేపీ హయాంలోనే అరుదైన గౌరవం దక్కిందని, దానిని దృష్టిలో పెట్టుకొని నరేంద్ర మోదీకి మద్దతు పలకాలని, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాండ్ర వినోద్ రావు, కేవీ రంగాకిరణ్, ఆకుల నాగేశ్వరరావు, పి.రవీందర్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, బైరీ నిర్మల, శ్రీధర్ యాదవ్, వంశీ, గుమలాపురం సత్యనారాయణ, గోవిందాచారి, సాయికిరణ్ పాల్గొన్నారు.

వినోద్‌రావు గెలుపు కోసం ప్రచారం

సుజాతనగర్: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపు కోరుతూ సర్వారం గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుస్తూ బీజేపీకి ఓటు వేసి మోదీని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీవీకే మనోహర్, జల్లారపు శ్రీనివాస్, పైడిపాటి రవీందర్, రాజేశ్‌నాయక్, నరేంద్రబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నుంచి సీపీఐలో చేరిక


సీపీఐలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సాబీర్‌పాషా తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం 17వ వార్డ్ కౌన్సిలర్ గుమ్మడి కల్యాణితో పాటు పీక కృష్ణ, సీతక్క తదితరులే కాక పలువురు వివిధ పార్టీలకు రాజీనామా చేసి సోమవారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలతో నిమిత్తం లేకుండా అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉండేది సీపీఐ మాత్రమేనని తెలిపారు.

మలేరియా నివారణ చర్యలు షురూ


సిద్ధారంలో రక్త నమూనా సేకరిస్తున్న సిబ్బంది

టేకులపల్లి: మండల వైద్యాధికారి కందుల దినేశ్ ఆధ్వర్యంలో మలేరియా నివారణ చర్యలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా మలేరియా ప్రభావిత వలస ఆదివాసీ గ్రామాలైన సిద్ధారం, మొట్లగూడెం, నాగారపుజోగుకు చెందిన ప్రజల నుంచి సోమవారం రక్తనమూనాలు సేకరించారు. మొత్తం 96 మంది రక్త నమూనాలను సేకరించామని, మలేరియా కారక జీవిని ముందుగా గుర్తించి తగిన చికిత్స అందిస్తామని వైద్యాధికారి దినేశ్ తెలిపారు. అనంతరం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, పోరండ్ల శ్రీనివాస్, శైలజ, చందన, మానస, స్రవంతి, ధనసరి రాంబాబు, రమాదేవి, సారక్క, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?


బొమ్మనపల్లి - శంభునిగూడెం మార్గంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేని కారణంగా బొమ్మనపల్లి – శంభునిగూడెం రహదారిలో ప్రయాణం చేయాలంటే జనం జంకుతున్నారు. బొమ్మనపల్లి దాటిన తరువాత కొత్తతండా(జి) క్రాస్‌రోడ్ సమీపంలో రోడ్డుపై కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కల్వర్టుకు రెండు వైపులా తెగిపోవడమే కాక రహదారి మధ్యలో రంధ్రం పడింది. రోడ్డు కింద భాగం డొల్లగా ఉంది. భారీ వాహనాలు, ప్రధానంగా ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుండటం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏళ్లుగా ఇదే సమస్య ఉన్నందున ప్రమాదం జరగక ముందే మరమ్మతులపై అధికారులు స్పందించి దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.